క్లుప్తంగా

ఆంజనేయుడికి పూజలు

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి గ్రామంలో వెలసిన అభయాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అభినందన

రాజంపేట రూరల్ : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో 14 ఏళ్లుగా సేవలందిస్తున్న డాక్టర్ పి.ద్వారకనాథరెడ్డికి టీచర్ అవార్డ్‌ను జేఎన్‌టీయూ అందించింది. మంగళవారం కళాశాలలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ద్వారకనాథరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్రకమిటీలో చోటు

రాజంపేట టౌన్ : పట్టణానికి చెందిన నేతి నాగేశ్వరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కమిటీలో చోటు లభించింది. ఈవిషయాన్ని ఆయన మంగళవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్ర మహాసభల సందర్భంగా తనను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రాష్ట్ర నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి

ఓబులవారిపల్లె : బోటుమీదపల్లి అరుంధతివాడ గ్రామస్తులు శ్మశానానికి స్థలం కేటాయించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిని కోరారు. మంగళవారం కొర్లకుంట గ్రామంలో సాయికిషోర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులు ఆయనతో మాట్లాడారు. అనారోగ్య కారణంగా గ్రామంలో ఓ వ్యక్తి చనిపోయాడని, శ్మశానం కోసం గతంలో రెవెన్యూ అధికారులకు అర్జీ ఇచ్చినా ఇప్పటి వరకు కేటాయించలేదని, కావున తమకు వెంటనే అంత్యక్రియలు జరుపుకునేందుకు శ్మశాన స్థలం ఏర్పాటు చేయాలని సాయికిషోర్ రెడ్డిని కోరారు. ఇందుకు సాయికిషోర్ రెడ్డి వెంటనే స్పందించి ఫోన్ ద్వారా రెవెన్యూ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార మార్గం చూపించాలన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్బీకే తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాయలకులు మర్రిపాటి నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ – పంట నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారికి వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్బీకేలో యూరియా నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ కె.రమేష్‌రెడ్డి, ఆర్బీకే సహాయకులు సందీప్ సింహ యాదవ్, సిబ్బంది జనార్దన్, చంద్రకళ, లక్ష్మీదేవి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి చేపట్టిన 21వ తిరుమల మహాపాదయాత్రలో పాల్గొనేదుకు వస్తూ ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట సమీపంలో ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆవుల కూటల్‌రెడ్డి అలియాస్ అశోక్‌రెడ్డి కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పరామర్శించారు. కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 6 మందిని ఆకేపాటి మంగళవారం పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను సమాచారం అడిగి తెలుసుకున్నారు ఆకేపాటి వెంట కోల కొండయ్య, వల్లి చాన్, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం, సారా నిర్వీర్యం

పీలేరు రూరల్ : పీలేరు సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ నల్లబెల్లం, సారా నిర్వీర్యం చేశారు. మంగళవారం సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వి. శ్రీనివాసులు సమక్షంలో పీలేరు సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ 350 కేజీల నల్లబెల్లం, 30 లీటర్ల సారా నిర్వీర్యం చేశారు.

వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్ తనిఖీ

వైవీయూ : వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్‌లోని పలు విభాగాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరును పరిశీలించారు. సెలవులో ఉన్నవారి అనుమతి పత్రాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సరిగాలేని శాఖల సిబ్బందిని ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే చర్యలు ఉంటాయన్నారు.

వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చారిత్రాత్మకం

రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి



సుండుపల్లె మండలంలో వలంటీర్లకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

సుండుపల్లె(రాజంపేట) : రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మకమని రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం సుండుపల్లెలో ఎంఆర్‌కేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వలంటీర్లకు బ్యాగులు, దుస్తులను మేడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం సాహసోపేతమైన నిర్ణయమన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని టి.సుండుపల్లె మండలం ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడా ఈనెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వలంటీర్లకు రెండు జతలు దుస్తులను 260 వలంటీర్లకు ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఆయన అందజేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లను నియమించినప్పటి నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల సేవలు చిరస్మరణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలవడంలో వలంటీర్ల కృషి ఎంతో ఉందని కొనియాడారు. కరోనా సమయంలో ప్రజలకు మేమున్నామంటూ సహాయక చర్యలు అందిస్తూ తమ బాధ్యతను చాటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామస్వామి రెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, ఎంపీపీ రాజమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ రెహమాన్, కో-ఆప్షన్ మెంబర్ కలీం బాషా, స్టేట్ బీసీ డైరెక్టర్ రాజు, మంత్రి శివారెడ్డి, ముడుకు బాబు, పోలిమేరపల్లి సర్పంచ్ శ్రీనివాసులు, పాపన్నగారిపల్లి బాబు రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ సల్మాన్, చింటూ, బలరాం రాజు, చోటు, కేతిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రనాయక్, వీరమల్లయ్య నాయుడు, ఎంపీటీసీలు అమరేశ్వరీ, రెడ్డమ్మ, రాయవరం కరీంబాషా, ఉమర్, సోషల్ మీడియా కన్వీనర్ ఖలీల్, ఎంపీడీఓ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



యువతికి కేక్‌ను తినిపిస్తున్న ఎమ్మెల్యే మేడా

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా దర్బార్

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



ప్రజా సమస్యలు వింటున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరింపచేశారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని దీనివలన ప్రతి పథకం ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు. అనంతరం రైల్వేకోడూరు మండలంలో జరుగుతున్న పలు రకాల అభివృద్ధి పనులపై పార్టీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కొరముట్లను కలిసిన రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీ

రైల్వేకోడూరు అర్బన్ : నూతనంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా నియమితులైన గునిశెట్టి రమేష్ మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నాణ్యమైన వైద్య సేవలందించండి

రాయచోటి టౌన్ : ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి – చిత్తూరు రోడ్డులో నూతనంగా డాక్టర్ అగర్వాల్ ఐ క్లీనిక్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మత గురువు పర్కాజీ షర్ఫుద్దీన్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అగర్వాల్ ఐ కేర్ సంస్థ వారు రాయచోటి కేంద్రంగా ఐ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఇది వర్చువల్‌గా కనెక్ట్ అయ్యి నిపుణులైన వైద్యుల ద్వారా చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అగర్వాల్ ఐ కేర్ సంస్థ ప్రసిడెంటెంట్ గణేష్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచనల మేరకు డిసెంబర్, జనవరి నెలలో ఫీజులు లేకుండా ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీకృష్ణ, లయన్ తులసీశ్వరెడ్డి, ఫయాజ్ అహమ్మద్, పట్టణ అధ్యక్షులు రియాజూర్ రహిమాన్, రోటరీ క్లబ్ సభ్యులు కూనా కృష్ణదేవరాయులు, అష్రఫ్, మస్తాన్, డాక్టర్ అగర్వాల్ ఐ కేర్ సెంటర్ మేనేజర్ శివ దొరై, బుల్లిబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎరుకలరెడ్డి తదితరులు

సంబేపల్లె : మండల కేంద్రం పరిధిలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మను మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, ఎమ్మెల్యే క్వార్టర్స్ విశ్రాంత ప్రభుత్వ చీఫ్ మెడికల్ ఆఫీసర్, స్వాతంత్ర్య సమర యోధులు యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి కుమారుడు యర్రపురెడ్డి ఎరుల రెడ్డి, ఇండియన్ డాక్టర్స్ అసోసియేషన్ రాయచోటి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.సత్యనారాయణ రెడ్డిలు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ పూజారులు వారికి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. ఆలయ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా ఎరుకల రెడ్డి మాట్లాడుతూ దేవరరాయి నల్లగంగమ్మతల్లి ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, యర్రపురెడ్డి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గుణయాదవ్



నందలూరు(రాజంపేట) : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పునగాని గుణ యాదవ్ వైఎస్సార్‌సీపీ బీసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా హరికృష్ణ



పెనగలూరు (ఓబులవారిపల్లె) : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా పెనగలూరు మండలానికి చెందిన తలారి హరికృష్ణను నియమించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆదేశాలతో నియామక పత్రాలు అందుకున్నారు.

ఓటరు జాబితాను పూర్తి చేయండి



జాబితాను పరిశీలిస్తున్న డీటీ మురళీకృష్ణ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో పెండింగ్‌లో ఉన్న ఓటర్ జాబితాను వెంటనే పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన బీఎల్‌ఓలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి రెండు పోలింగ్ బూతులలో రెండు ఫోటోలు ఉన్న ఓటర్లతో చర్చించి ఒకే ఫోటో ఉండే విధంగా దరఖాస్తు పూర్తి చేయాలన్నారు.

రాజ్యాంగంపై అవగాహన

కడప సెవెన్‌రోడ్స్ : బహుజన మేలుకో.. రాజ్యాంగాన్ని తెలుసుకో అనే కరపత్రాల ద్వారా ఏపీ దళితమిత్ర సంఘం ఇంటింటి ప్రచార అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టింది. కడప నగరం అంబేడ్కర్ నగర్ దండోరా కాలనీలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కె.రామాంజనేయులు, మూడవ డివిజన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కొలతలలో అవకతవకలు కనిపిస్తే చర్యలు



తూనికల కొలతలను పరిశీలిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లె : తూనికలు, కొలతలలో అవకతవకలు కనిపిస్తే చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ అధికారులు నాగరాజు, రమేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, ఎంవి రమేష్ కుమార్ రెడ్డిల పర్యవేక్షణలో బరువు యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి, రామాపురం, చక్రాయపేట మండలాల్లోని వ్యాపారస్తులకు బరువు యంత్రాల పరిశీలనకు హాజరుకావాలని తెలిపారు. బరువు యంత్రాలలో తూకాలు తేడాలు గమనించి పరిశీలించారు. ఎలక్ట్రానిక్ తూకాలలో ఉండే లోడ్ సెల్‌ను గమనించి తూకాలను సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ప్రతి వ్యాపారి నిబంధనలు పాటించాలన్నారు. నిర్ణీత కాలపరిమితి పూర్తయిన వెంటనే తిరిగి కాటాలకు అనుమతి తీసుకోవడం, తూకం రాళ్లకు ముద్రలు వేయించుకోవాలన్నారు. నిర్ణీత ధరలు కంటే ఎక్కువకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారస్తులను హెచ్చరించారు. కార్యక్రమంలో తూనికల కొలతల సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వండి

ఓబులవారిపల్లె : గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత కార్మిక కుటుంబాలలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పోరాట కమిటీ జేఏసీ నాయకులు సీఓ సుదర్శన్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఏపీఎండీసీ సంస్థలో అవుట్ సోర్సింగ్, ట్రైనీ ఉద్యోగులుగా అరవై సంవత్సరాలు అనంతరం పదవీ విరమణ పొందినప్పటికీ ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వడం లేదని, అటువంటి వారి కుటుంబంలో ఒక్కరికీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలన్నారు. అలాగే ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, చనిపోయిన కుటుంబాలకు రావాల్సిన జీవిత బీమా నగదు వెంటనే ఇన్సూరెన్సు కంపెనీలు ద్వారా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్ వెంకటేష్, బండారు భాస్కర్, నారదాసు సుబ్బరాయుడు, గునిపాటి ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం ఆర్ముగం

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని ఏపీఎం ఆర్ముగం పేర్కొన్నారు. మంగళవారం బాలిరెడ్డిపల్లె గ్రామంలో మహిళా రైతు రత్నమ్మ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంట పొలాలను మండల మహిళా సమాఖ్య బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఎం ఆర్ముగం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. గ్రామ రైతు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి మాట్లాడుతూ ఘన ద్రవ జీవామృతాలు తయారు చేసి పంటలకు అందించడం ద్వారా దిగుబడి పెంచవచ్చన్నారు. కావున రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బుల్లయ్య, గంగాధర్, శంకరయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఘనంగా ఏర్పాట్లు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 23(శనివారం) ముక్కోటి ఏకాదశికి వైకుంఠాన్ని తలపించేలా ఏర్పాట్లు ఉంటాయని నిర్వాహకులు పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వైష్ణవ ఆలయం అయిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని ముక్కోటి ఏకాదశి నాడు సుందరంగా అలంకరించనున్నట్టు తెలిపారు. పుష్పాలంకరణకు ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ యజమానులు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డి, మేడా మధుసూదన్ రెడ్డి సహకారంతో సుమారు రూ. 3లక్షల 50 వేలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అలాగే ముక్కోటి ఏకాదశి నాడు వచ్చే భక్తులకు ప్రత్యేకంగా అన్నప్రసాదాలు కూడా పంపిణీ చేస్తామన్నారు. ఏర్పాట్లకు ముందుకొచ్చిన మేడా సోదరులకు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యాయం చేయాలంటూ రిలే దీక్షలు

రాయచోటి అర్బన్ : భూమి విషయంలో తమకు న్యాయం చేయాలంటూ చిన్నమండెం మండలం కేశాపురం దళితవాడకు చెందిన రైతు పెద్దగంగయ్య కుటుంబీకులు జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. దీక్షలను సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్‌లు ప్రారంభించి మాట్లాడారు. దళితరైతు పెద్దగంగయ్య గత 30 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న భూమి తమదంటూ ఫారెస్టు అధికారులు ఆయనను అడ్డుకున్నారన్నారు. పైగా అతని వద్ద తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నారన్నారు. భూమి ఎవరిదో తేల్చడంలో ఇటు రెవెన్యూ, అటు ఫారెస్టు అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే సదరు భూమి రెవెన్యూదా ? ఫారెస్టు వారిదా తేల్చడంతోపాటు గంగయ్యపై దౌర్జన్యం చేసిన ఫారెస్టు అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపి గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, రెడ్డి సుధాకర్, పండరయ్య, వీరభద్ర, శ్రీనివాసులు, నరసింహులు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీక్షిత్ యాత్ర

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల, రెడ్డివారిపల్లెలలో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాయని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నాయన్నారు. అనంతరం పలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు ఆదర్శం కావాలి

చిట్వేలి : ఎన్‌సీసీ విద్యార్థులు అందరికీ ఆదర్శం కావాలని ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ ట్రూప్ అధికారి పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కడప నుంచి వచ్చిన హవాల్దార్లు సమయ్‌సింగ్, సందీప్‌లు డ్రిల్, 22 రైఫిల్, 7.66 రైఫిల్, మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. 2024 జనవరిలో జరగబోయే ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఎన్‌సీసీ ట్రూప్ అధికారి పసుపుల రాజశేఖర్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సార్జెంట్లు శరత్, లక్ష్మీ త్రివేణి, ఎన్‌సీసీ కార్పొరల్‌లు యజ్ఞధర్, నందినీ, సీనియర్, జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

రాజంపేట రూరల్ : పారుడు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంలో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని అత్తిరాల పశు వైద్యాధికారిణి భాగ్యవతి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మందరం ఎస్టీ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయబాస్కర్‌రావు మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. అనంతరం రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను పంపిణీ చేశారు. అదే విధంగా పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 246 మేకలకు పారుడు వ్యాధి టీకాలు వేశామని తెలియజేశారు. 300 పైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేయడం జరిగిందన్నారు. 308 పైగా మేకలు, పాడి పశువులకు పిడుదల మందులు అందించామన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ విద్యాసాగర్, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు కావాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోండి



రాజంపేట టౌన్: ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థులు



లక్కిరెడ్డిపల్లె: ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓలు

రాజంపేట టౌన్ : విద్యార్థులు శాస్త్రవేత్తలు కావాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా చదవాలని ఎంఈఓ-1 కొండూరు రఘునాథరాజు, ఎంఈఓ-2 సుబ్బరాయుడు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్)ను ఎంఈఓలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పలు ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి వాటి పనితీరును, ప్రయోజనాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓలు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అందరు కూడా తమ మేధస్సుకు పదను పెట్టి సమాజానికి ఉపయోగపడే ఎగ్జిబిట్స్ తయారు చేయడం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ ఉందని, అందువల్ల శాస్త్రవేత్తలు అయ్యేలా ఇప్పటి నుంచే ఒక ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను శాస్త్రవేత్తలను చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు నటవ నరసింహులు, వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో 14, గ్రూపు విభాగంలో 11 ఎగ్జిబిట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. టీచర్స్ విభాగం నుంచి వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మూడు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఇందులో వ్యక్తిగత విభాగంలో బోయినపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన లోహిత, గ్రూపు విభాగంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన శ్రీహిత, సబీహా, టీచర్స్ విభాగంలో తాళ్లపాక హైస్కూల్‌కు చెందిన వెంకటేశ్వర్లు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జూనియర్ కళాశాల అధ్యాపకులు చెన్నారెడ్డి, చంద్రమోహన్, బాబయ్యలు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నాగమణి, ఎస్టీయూ నాయకులు వై.సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికే సైన్స్ ఫెయిర్

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికే సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారని ఎంఈఓలు చక్రనాయక్, వెంకటసుబ్బయ్య, విశ్రాంత ఎంఈఓ సెల్వరాజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను విశ్రాంత ఎంఈఓ సెల్వరాజు, ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డిలు ప్రాజెక్టుల నమూనాలను పరిశీలించి ముగ్గురు విద్యార్థులను జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఏపీ మోడల్ స్కూల్ దేవలంపల్లి జెడ్పీ హైస్కూల్, లక్కిరెడ్డిపల్లి జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ప్రాజెక్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు సెల్వరాజు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడానికి సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి ప్రాజెక్టు వర్క్‌లో విద్యార్థి దశ నుంచి అలవరుచుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిశీలకులు విజయ, సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో మానసిక వికాసం

నందలూరు(రాజంపేట) : పరిసరాల విజ్ఞానం ప్రతి మానవునికి మానసిక వికాసాన్ని కల్గిస్తుందని మండల విద్యాశాఖ అధికారి నాగయ్య తెలిపారు. మంగళవారం నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ (కౌశల్) పోటలు నిర్వహించారు. పోటీలలో వ్యక్తిగత విభాగంలో జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినీ కె.మేఘు వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రూపు విభాగంలో నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.రితీష్, టి.నాగేంద్రలు త్రి-డీ హాలోగ్రామ్ ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయ విభాగంలో నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రసాయనిక శాస్త్ర ఉపాధ్యాయురాలు విజయకుమారి మండలస్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శ్రీనివాసులు, జిల్లా అప్‌కాస్ట్ సమన్వయకర్త రవిశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను బయటికి తీసుకురావాలి

గాలివీడు : విద్యార్థుల్లో సృజనాత్మకతను బయటికి తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారులు నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ప్రాంగణంలో సైన్స్ ఫెయిర్‌ను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని తక్కువ ఖర్చుతో విద్యార్థుల్లో సృజనాత్మకతను ఎలా బయటికి తీయవచ్చునని, వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను తయారి చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహిద్దీన్‌బాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీలకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగభద్రతను కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నడిరోడ్డు పైనే భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, ధనిక అనే అంతరాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు, పిల్లలకు సేవ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారంటూ మండిపడ్డారు. వారికి గ్రాట్యుటీ, కనీసవేతనం ఇచ్చేవరకు సీఐటీయూ అంగన్ వాడీలకు అండగా పోరాడుతుందంటూ చెప్పారు.